సాక్షి తిరుపతి

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,740
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,157
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.66,400
రిటైల్ వెండి గ్రాము	రూ.68.40

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	18
తిరుమల	31	14
చిత్తూరు	36	17
గూడూరు	35	19
నగరి	36	17



తిరుచ్చిపై సిరులతల్లి

తిరుచానూరు(చంద్రగిరి): వారపు ఉత్సవాల్లో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

న్యూస్‌రీల్

27, 28 తేదీల్లో పారిశ్రామిక ఎగ్జిబిషన్

తిరుపతి అర్బన్: తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో పారిశ్రామిక ఎగ్జిబిషన్, వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను నిర్వహించనున్నట్టు భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం సహాయ సంచాలకులు జీవీఆర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమల వారు హాజరై ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచడంతోపాటు బయ్యర్ అండ్ సెల్లర్స్ మీట్, ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు ఆయన వెల్లడించారు.

ఆర్టీసీ టెండర్లు

- 88 దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న 88 దుకాణాలను భర్తీ చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. శుక్రవారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆయా ఆర్టీసీ డిపోల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మార్చి 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఇంటిగంట వరకు తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బాక్స్‌లో టెండర్ దరఖాస్తులు వేయాలని, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎన్నికల నిర్వాహణపై కలెక్టరేట్‌లో చర్చిస్తున్న అబ్జర్వర్లు

తిరుపతి అర్బన్: జిల్లాలో మార్చి 13న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల అబ్జర్వర్లు కోన శశిధర్, భాస్కర్ కాటమనేని(ఐఏఎస్‌లు) అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు శుక్రవారం కలెక్టరేట్‌కు విచ్చేసి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. చిన్నపాటి పొరబాట్లకూ తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏపీహెచ్‌ఈఆర్‌ఎంసీ సభ్యుల బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డిని సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, మానిటరింగ్ కమిషన్ (ఏపీహెచ్‌ఈఆర్‌ఎంసీ) సభ్యులుగా ఎస్వీయూ రిటైర్డ్ రెక్టార్ ప్రొఫెసర్ వీ.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్వీ వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్‌వీ.ఈశ్వరరెడ్డిని నియమిస్తూ ఏపీ ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్ల పాటు ఈ పదవిలో వారు కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమరావతిలో వారు బాధ్యతలు స్వీకరించారు. తమపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతలను చిత్తశుద్ధితో పనిచేసి ఉన్నత విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పట్టభద్రులకు 23.. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ 8

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలు చేసిన నామినేషన్లను శుక్రవారం కలెక్టరేట్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌లు, అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల అధికారి హరి నారాయణన్ నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఆమోదం పొందిన, తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 3 గంటలకు నోటీస్ బోర్డులో పెట్టారు. ఈ నెల 27వ తేదీన బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్టు అధికారులు తెలిపారు. డీ ఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్, సూపరింటిండెంట్లు మురళి, వెంకటేశ్వర్, శేషగిరి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, తిప్పేస్వామి, సీఐలు మద్దయ్య ఆచారి, నరసింహరాజు పాల్గొన్నారు.

ఆమోదం.. తిరస్కరణ

నామినేషన్ల పరిశీలన అనంతరం పట్టభద్రులకు సంబంధించి 30కి గాను 23 నామినేషన్లను ఆమోదించారు.వివిధ కారణాలతో 7 నామినేషన్లు తిరస్కరించారు. ఉపాధ్యాయుల స్థానానికి 8 నామినేషన్లకు గాను 8 ఆమోదం పొందాయని అధికారులు ప్రకటించారు.

జన్మదినం.. వైభవోత్సవం!

తిరుపతి 893 జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి. శుక్రవారం నగరంలో ఎటుచూసినా అరటి పిలకలు.. పచ్చటి మామిడి తోరణాలు.. వీధుల నిండా విరుల సింగారాలే కనిపించాయి. భక్తుల గోవిందనామస్మరణలు మార్మోగాయి. చెక్క భజనలు.. కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మంగళవాయిద్యాలు ప్రతిధ్వనించాయి. వేదఘోషతో స్థానిక వీధులన్నీ పులకించాయి. సమతామూర్తి ఫ్లెక్సీలు, జీయ్యంగార్ల దీవెనలు నాటి చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేశాయి. వ్యక్తులకు మాత్రమే జరిగే జన్మదిన వేడుకలు ఓ నగరానికి నిర్వహించడం తమ పూర్వజన్మ సుకృతమని నేతలు కొనియాడారు.

- ఘనంగా తిరుపతి జన్మదిన వేడుకలు
- గోవిందనామస్మరణతో పులకించిన పురవీధులు
- పసుపునీళ్లు పోసి, గుమ్మడికాయలతో దిష్టితీసిన స్థానికులు
- ఇది జన్మజన్మల అనుబంధమని కొనియాడిన నేతలు
- సమతామూర్తి ఫ్లెక్సీలు చేతబట్టి భారీ ప్రదర్శనలు



గంగమ్మ ఆలయం నుంచి భాష్యకార్ల సన్నిధికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

తిరుపతి కల్చరల్: తిరుపతి 893 జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో సమతా దీక్షులైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి నగర ప్రముఖులతో కలిసి తొలుత శ్రీగోవిందరాజస్వామి ఆలయం వద్దనున్న శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పట్టు వస్త్రాలను శ్రీగోవిందరాజస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ భాష్యకారులకు వస్త్రాలు బహూకరించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భజన కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఆధ్యాత్మిక శోభాయాత్ర ఆరంభించారు. భక్తులు శ్రీరామానుజాచార్యులు చిత్రపటాలు, మా తిరుపతి పుట్టిన రోజు పండుగ ఫ్లెక్సీలు చేతబట్టి గోవిందనామస్మరణ చేస్తూ ముందుకు కదిలారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారుల చెక్క భజనలు, కోలాట ప్రదర్శనలు, రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారుల పౌరాణిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. అడుగడుగునా పసుపునీళ్లు పోస్తూ, గుమ్మడి కాయలతో దిష్టితీసి నీరాజనాలు పట్టారు.

తిరుపతి పుట్టిన రోజు పండుగ కొనసాగిస్తాం

శోభాయాత్రలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ సమతామూర్తి శ్రీరామానుజాచార్యులు 1130 ఫిబ్రవరి 24న శంకుస్థాపన చేసిన పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుపతి అని, ఇంతటి చారిత్రకత నేపథ్యం కలిగిన తిరుపతి పుట్టిన రోజు వేడుకలను రాబోవు తరాలకు మార్గదర్శకత చేస్తూ ప్రతి ఏటా మరింత వైభవోపేతంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రపంచంలో వ్యక్తులకు మాత్రమే జన్మదిన వేడుకలు జరుగుతాయని, అయితే ఒక ప్రాంతానికి జన్మదిన వేడుకలు జరగడమంటే ఒక్క తిరుపతికి మాత్రమేనన్నారు. తిరుమలలోని అర్చకుల నివాసం తిరుపతిలో ఉండాలనే ఆశయంతో శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని స్థాపించడంతో పాటు గోవిందరాజపురం ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి గోవిందరాజపురం, తర్వాత రామానుజాపురంగా.. ఆ తర్వాత 13వ శతాబ్దం నుంచి తిరుపతిగా పిలుస్తున్నారని చెప్పారు. ఇక్కడ అణువణువూ పవిత్రమన్నారు. తిరుపతి నగర పుట్టిన రోజు మహోన్నత కార్యక్రమాన్ని తాను నిర్వహించడం ఆ భగవంతుని అనుగ్రహమేనన్నారు. కార్యక్రమంలో తిరుపతి నగర ప్రముఖులు, మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ ప్రజాసంఘాలు, సంస్థల ప్రతినిధులు, నగరంలోని 50 డివిజన్ల కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ ఆలయాల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ సారె

ఎమ్మెల్యే, మేయర్, డెప్యూటీ మేయర్లతోపాటు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది గంగమ్మ ఆలయం నుంచి సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమతో కూడిన సారెను శ్రీగోవిందరాజస్వామి ఆలయం వరకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు.



పురవీధుల్లో వేదపారాయణం



పసుపు నీళ్లతో నిరీక్షిస్తున్న మహిళలు



రామానుజాచార్యుల ప్లకార్డును చేతబూని కాళ్లకు చెప్పులు లేకుండా శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

• నూతన గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా..



రాజ్‌భవన్‌లో శుక్రవారం నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే రోజా

• జ్ఞాపిక



గవర్నర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి -సాక్షి, అమరావతి

మేం రాం!



లోకేష్ యువగళం పాదయాత్రను హైలెట్ చేసేందుకు టీడీపీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. చినబాబు ఆధ్వర్యంలో ఇతర పార్టీ నేతలను చేర్పించేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఇందులో ముఖ్యంగా గ్రామస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు వెళ్లి మధ్యస్తాలు పెడుతున్నారు. తమ పార్టీలో చేరాలంటూ కాళ్లబేరానికి దిగుతున్నారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కొండువా కప్పుకోవాలని బతిమలాడుతున్నారు. ఆయన పాదయాత్రగా వచ్చేటప్పుడు పూల దండ వేసి స్వాగతం పలకాలని కాళ్లావేళ్లాపడుతున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మీరేం కోరుకున్నా చేస్తామంటూ బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు. కానీ జగన్ సైన్యం ససేమిర అంటున్నారు. 'మీకో దండం.. మేం రాం' అంటూ ముఖాన్నే చెప్పేస్తున్నారు. దీంతో చేసేది లేక టీడీపీ నేతలు బిక్కమొఖాలేస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం

- కుప్పం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్ర జీడీనెల్లూరు నియోజకవర్గం మీదుగా సాగింది. మార్గమధ్యంలో శ్రీరంగరాజపురం మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు టీడీపీలో చేరేలా ఆ పార్టీ నేతలు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా కృష్ణమూర్తి(పేరుమాాం) నాయకుడి ఇంటికెళ్లి టీడీపీలో చేరాలని బతిమలాడారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకోవాలని సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మండల స్థాయి పదవులు ఇస్తామని నమ్మబలికారు. ఇక చిన్నాచితక కాంట్రాక్టర్ పనులూ చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. కానీ ఆయన 'మాకొద్దు బాబు' అంటూ వారి ముఖాన్నే చెప్పడంతో ఖంగుతిన్నారు.
- నాలుగు రోజుల క్రితం శ్రీకాళహస్తి నియోజకవర్గం, పాపానాయుడుపేట మండలంలో లోకేష్ పాదయాత్ర సాగింది. స్థానికంగా చురుగ్గా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుచ్చిరెడ్డి (పేరుమార్చాం) ఇంటికి డబ్బు, పార్టీ కండువాలతో టీడీపీ నాయకులు వెళ్లారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాలని బేరాలకు దిగారు. మీరుచెబితే గ్రామస్తులు కూడా చాలామంది చేరుతారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు ఏం కావాలన్నా చేస్తామంటూ ఆఫర్లు కురిపించారు. కానీ ఆయన 'మేం రాం' అంటూ తెగేసి చెప్పడంతో అక్కడి నుంచి ఉడాయించారు.

.. జిల్లాలో ఇవి మచ్చుకు రెండు మాత్రమే. లోకేష్ పాదయాత్రలో ఇలాంటివి నిత్యకృత్యం. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఎంచుకుని టీడీపీనేతలు బేరాలకు దిగుతున్నారు. ఆఫర్లు ఇస్తూ పార్టీలో చేరాలని గడ్డాలు పట్టుకుని మరీ బతిమలాడుతున్నా.. జగన్ సైన్యం అందుకు ససేమిర అనడం చర్చనీయాంశమవుతోంది.

- టీడీపీలో చేరాలంటూ ఆ పార్టీ నేతల బేరసారాలు
- లోకేష్ ఆధ్వర్యంలో కండువాలు కప్పుకోవాలంటూ కాళ్లబేరాలు
- అధికారంలోకి వస్తే ఏం కావాలన్నా చేస్తామంటూ బంపర్ ఆఫర్లు
- గ్రామస్థాయి లీడర్ల ఇళ్లకు వెళ్లి మధ్యస్తాలు
- ససేమిర అంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ నేత లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నేతలు రకరకాల ఎత్తులు, కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలంలో ఓ టీడీపీ కార్యకర్తకు చెందిన ఆరు ఎకరాల వేరుశనగ పంటను దున్నేసి దాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని ప్రయత్నించారు. ఆ పంటను చినబాబు పరిశీలించి వైఎస్సార్‌సీపీపై బురదజల్లే విధంగా స్కెచ్చేశారు. కానీ అది బెడిసికొట్టడంతో ఇప్పుడు కొత్త నాటకాలకు తెరలేపుతున్నారు. క్షేత్ర స్థాయిలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఎంచుకుంటున్నారు. వారిని ఎలాగైనా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరేవిధంగా రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే శ్రీకాళహస్తి నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రకు ముందు రోజు టీడీపీ నేతలు బొజ్జల సుధీర్‌రెడ్డి, మండల స్థాయి నాయకులు కొందరు గతంలో ఆ పార్టీ కోసం పనిచేసిన వారి నివాసాలుకు వెళ్లారు. అలాగే వైఎస్సార్‌సీపీ నేతలను విడివిడిగా కలిసి టీడీపీలోకి ఆహ్వానించగా.. వారు ససేమిర అనడంతో చేసేదిలేక అక్కడి నుంచి వెనుదిరిగినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ప్రత్యేక నిఘా

గ్రామస్థాయిలో ముఖ్యమైన వైఎస్సార్‌సీపీ నేతలను కలిసేందుకు టీడీపీ ఓ బృందాన్ని రెడీ చేసింది. ఆ బృందంలోని సభ్యులు యువగళం పాదయాత్ర సాగే ముందురోజు ఆయా గ్రామాల్లోని నేతల ఇళ్లకు వెళ్లడం.. వారిని పార్టీలోకి రావాలని బతిమలాడుతూ బేరసారాలు కుదర్చడమే పనిగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. గ్రామంలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకులైతే ఆయా మండలాల నాయకులే వెళ్లి కలుస్తున్నట్టు సమాచారం. మరో వైపు శ్రీకాళహస్తిలో తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు తల్లి బొజ్జల బృందమ్మ సైతం నియోజకవర్గంలో ముఖ్యనాయకుల నివాసాలకు వెళ్లి రహస్య మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

తిరుపతిలో అద్దె మనుషులకు పార్టీ కండువాలు?

తిరుపతి అసెంబ్లీ పరిధిలో యువగళం పాదయాత్ర సాగుతుండడంతో స్థానిక టీడీపీ శ్రేణులు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. 'పార్టీలో చేరండి, లేదంటే పాదయాత్రలో పాల్గొనండి' అంటూ ప్రాధేయపడుతున్నారు. ఎవ్వరూ సుముఖంగా లేకపోవడంతో కొందరు అద్దె మనుషులను పిలిపించి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించేలా ఏర్పాట్లు చేసినట్టు సమాచారం.

ఒక్కరే మిగిలారు

- అధికారిక ప్రకటనే తరువాయి!



నామినేషన్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకపక్షంగా మారింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం నామినేషన్ ఒక్కటే మిగలడంతో ఈ స్థానం ఏకగ్రీవం కానుంది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, జేసీ వెంకటేశ్వర్ పరిశీలించారు. మధ్యాహ్నం వరకు కొనసాగిన పరిశీలనలో సిపాయి సుబ్రమణ్యం సమర్పించిన పత్రాలు అన్నీ పక్కాగా ఉండడంతో నామినేషన్‌ను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థి ధనంజయయాదవ్ నామినేషన్‌లో సక్రమంగా వివరాలు లేకపోవడంతో తిరస్కరించారు. దీంతో సిపాయి సుబ్రమణ్యం ఒక్కరే బరిలో మిగిలారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీగా ఎన్నికైన అభ్యర్థిని ప్రకటించనున్నట్లు జేసీ వెల్లడించారు.

వార్ వన్ సైడ్!

ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే అధికంగా ఉన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకే అని పలువురు విశ్లేషకులు వెల్లడించారు. ఈ క్రమంలో ఆ పార్టీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం నామినేషన్ ఒక్కటే మిగలడంతో వార్ వన్‌సైడ్‌గా మారిందని వివరించారు.

కేడర్‌లో జోష్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా గెలుస్తుండడం వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా నడిచిన క్రమంలో ఇది రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ కార్యకర్తలకు మరింత బూస్టప్ ఇస్తుందని నేతలు భావిస్తున్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం త్వరలోనే జరగనున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పడనుంది. సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా గెలుస్తున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేసే అవకాశముంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించుకునేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు సైతం సమష్టిగా పనిచేస్తున్నట్లు పలువురు నేతలు వెల్లడిస్తున్నారు.

బీసీలకు స్వర్ణయుగం

జగనన్న పాలనలో బీసీలకు స్వర్ణయుగం వచ్చింది. నాపై నమ్మకంతో ఎమ్మెల్సీగా నిలబెట్టిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా. వెనుకబడిన వర్గాలకు చెందిన అన్ని కులాల వారికి ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. 61 శాతం మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర పదవులు ఇచ్చారు. – సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

అలిగిన వేళనే చూడాలి!

- అలిగిన జ్ఞానాంబిక
- వెంబడించిన ముక్కంటీశుడు
- నేత్రానందంగా పల్లకీసేవ ఉత్సవం



భక్తజనసందోహం మధ్య పల్లకీ సేవ(ఇన్‌సెట్) అద్దంలో అమ్మవారి ప్రతిబింబం

శ్రీకాళహస్తి/తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పల్లకీసేవ నయనానందకరంగా సాగింది. ఈ సేవను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శ్రీకాళహస్తి పట్టణం సందడిగా మారింది.

అలిగిన వేళనే..

పార్వతీదేవి అర్ధాంగిగా చేసుకుని అర్ధనారీశ్వరుడు అయ్యాడు శ్రీకాళహస్తీశ్వరస్వామి. కాగా గంగను శిరస్సుపై ఉంచడానికి సహించని పార్వతీదేవి ఆయనపై అలిగి పల్లకీలో ముందుగా వెళుతుండగా ఆమెను వెంబడిస్తూ సర్వేశ్వరుడు రావడం ఈ ఉత్సవం ప్రత్యేకత.

దర్పణం సందర్శనం

అలిగి వెళుతున్న అమ్మవారి ముందు దర్పణాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అద్దంలో కనిపించే అమ్మవారి సుందరరూపాన్ని చూసి పునీతులయ్యారు. చతుర్మాడ వీధుల్లో విశేషంగా జరిగిన ఈ ఉత్సవంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

నేడు ఏకాంత సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏకాంత సేవ జరగనుంది. ఈనెల 13న భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

పేర్నాటికి విశ్రాంతి ఉపాధ్యాయుల సంఘం మద్దతు



మాట్లాడుతున్న విశ్రాంతి ఉపాధ్యాయుల సంఘం జనరల్ సెక్రటరీ రామిశెట్టి

కోట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఉమ్మడి నెల్లూరు జిల్లా రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఈ మేరకు సంఘం జనరల్ సెక్రటరీ రామిశెట్టి, ఉపాధ్యక్షుడు నారాయణరావు శుక్రవారం కోటలో మాట్లాడుతూ తమ సంఘం ద్వారా అందరం చర్చించి శ్యాంప్రసాద్ రెడ్డికి మద్దతు తెలపాలని నిర్ణయించినట్టు తెలిపారు.

60 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 60 మందికి రూ.12 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు ఉద్యోగి మునిబాబు తెలిపారు. తిరుమల ఒన్‌టౌన్ పోలీసులు 48 మందిపై, టూటౌన్ పోలీసులు 12 మందిపై కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచారు.

బరిలో మేరిగ మురళీధర్ ఒక్కరే



మేరిగకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కాండ్ర నారాయణరెడ్డి తదితరులు

- తిరస్కరణకు గురైన స్వతంత్ర అభ్యర్థి నామినేషన్
- సంబరాలు చేసుకున్న నేతలు



టవర్ క్లాక్ సెంటర్ వద్ద స్వీట్లు పంచిపెడుతున్న రూపేష్‌రెడ్డి తదితరులు

గూడూరు: స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో ఉమ్మడి ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా మేరిగ మురళీధర్ ఒక్కరే మిగిలారు. ఉమ్మడి ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్ ఈ నెల 22న నెల్లూరులో నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక సంస్థల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడంతో, ఆయన ఎన్నిక నల్లేరుపై నడకేనని అందరూ భావించారు. ఈ క్రమంలో ఆయనకు పోటీగా స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడంతో, ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం జరిగిన స్క్రూటినీలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఈ మేరకు మేరిగ మురళీధర్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందు మార్గం సుగమమైంది. ఈ నెల 27 ఉప సంహరణలకు గడువు ఉండడంతో, అనంతరం ఆయనను అదే రోజున అధికారికంగా ఎమ్మెల్సీగా ప్రకటించనున్నారు.

మిన్నంటిన సంబరాలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాండ్ర నారాయణరెడ్డి తదితరులు నెల్లూరులోని డీఆర్ ఉత్తమ్‌లో ఉన్న మేరిగకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, ముందస్తుగా అభినందనలు తెలిపారు. అలాగే పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద బారీగా బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచి పెట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మనుబోలు రూపేష్‌రెడ్డి, సాయి, శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, సతీష్, కార్తీక్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, కిషోర్, పవన్, ప్రవీణ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత నగరమే లక్ష్యం



విద్యార్థుల భారీ ర్యాలీ

తిరుపతి క్రైం: మాదకద్రవ్య రహిత తిరుపతి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు యాంటీ డ్రగ్స్‌పై శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి బాలాజీ కాలనీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా ప్రత్యేకంగా యువతను డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 90 విద్యా సంస్థలలో అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అదనపు ఎస్పీ వెంకటరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, సబ్ సూపరింటెండెంట్ స్వాతి, డీఎస్పీలు కాటమరాజు, నరసప్ప, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాదకద్రవ్య రహిత తిరుపతిపై అవగాహన ర్యాలీలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

మైనింగ్ అధికారులపై దాడి!



మైనింగ్ అధికారులను అడ్డుకుంటున్న టిప్పర్ల యాజమానులు



అధికారులకు వ్యతిరేకంగా రోడ్డుపై ఆందోళన చేస్తున్న దృశ్యం

- అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్ల సీజ్
- మా వాహనాలనే అడ్డుకుంటారా..? అంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన
- విజిలెన్స్ ఏడీతో సహా అధికారులపై దాడికి యత్నం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అధికారులు

తిరుపతి రూరల్: మట్టి మాఫియా బరితెగించింది. మైనింగ్, విజిలెన్స్ అధికారులపై దాడికి తెగబడింది. 'మా వాహనాలనే అడ్డుకుంటారా' అంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. చివరకు పోలీసుల సాయంతో మైనింగ్ అధికారులు బయటపడ్డారు. తమ విధులను అడ్డుకుని, తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసలేం జరిగిందంటే.. తిరుపతి రూరల్ మండలం, చిగురువాడ వద్ద రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలాలకు చెందిన కొందరు టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి రసీదులు, సీనరేజి చెల్లించకుండ భారీ ఎత్తున మట్టిని దోచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి విజిలెన్స్ సహాయ సంచాలకులు సునీల్ కుమార్, మరో ఇద్దరు అధికారులను ఫ్లెయింగ్ స్క్వాడ్‌గా పంపించారు. అందులో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలంలో అనధికారికంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేశారు. దీంతో రెండు మండలాల్లోని మట్టిని తరలించే టిప్పర్ల యాజమానులు తిరుపతి–రామచంద్రాపురం రహదారిపై బైఠాయించారు. తమ వాహనాలను వదిలేయాలని డిమాండ్ చేశారు. అసలు సీజ్ చేసే అధికారం మీకు లేదంటూ వాగ్వావాదానికి దిగారు. అధికారుల సెల్‌ఫోన్లు లాక్కున్నారు. సమాచారం అందుకున్న ఎంఆర్‌పల్లి ఎస్‌ఐ వినోద్‌కుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. మైనింగ్ అధికారులను క్షేమంగా స్టేషన్‌కు తరలించారు. అయితే ఘటన జరిగిన ప్రదేశం తమ స్టేషన్ పరిధి కాకపోవడంతో తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించారు. తమపై దాడి చేసి, విధులను అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మైనింగ్ ఏడీ సునీల్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు, రేపు తలకోనలో మారుపొంగళ్లు

ఎర్రావారిపాళెం: తలకోన శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాల్లో మారుపొంగళ్లు పెట్టనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్ని పూజా కార్యక్రమాలను తిరిగి నిర్వహిస్తారు. శనివారం రాత్రి జాగరణ, సంతానం లేని మహిళలు వరపడుట, స్వామి, అమ్మవారికి కైంకర్యాలు, అర్ధరాత్రి లింగోద్భవ దర్శనం, ఆదివారం ఉదయం 3 గంటలకు రుద్రాభిషేకం, మధ్యాహ్నం సిద్ధపూజా మహోత్సవం జరగనుంది.

తమ్ముడిపై కోపంతో కోళ్లను చంపేశాడు



విష గుళికల మందు తిని మృతి చెందిన నాటుకోళ్లు

చంద్రగిరి: గత కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య దారి సమస్య నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమ్ముడిపై ద్వేషం పెంచుకున్న అన్న, తమ్ముడికి చెందిన 30 నాటుకోళ్లకు గుళికల మందు పెట్టి చంపేసిన ఘటన మండల పరిధిలోని పాతశానంబట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడి కథనం.. పాతశానంబట్లకు చెందిన అన్నదమ్ములు సుబ్రమణ్యం, సిద్ధమునిశెట్టికి గత కొంత కాలంగా దారి సమస్యతో తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించే సుబ్రమణ్యం తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్దే నాటుకోళ్లను పెంచుతున్నారు. ఈ క్రమంలో తమ్ముడిపై పగబట్టిన సిద్ధమునిశెట్టి 30 కోళ్లకు విషపు గుళికల మందు పెట్టి చంపేశాడు. దీంతో బాధితుడు కోళ్లను తీసుకుని సాయంత్రం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. అన్యాయంగా మూగజీవాలను చంపేశాడంటూ సిద్ధమునిశెట్టిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

తుమ్మలగుంట వైకుంఠధామం ప్రారంభం



తుమ్మలగుంటలో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ చైర్మన్ జయచంద్రారెడ్డి, పక్కన సర్పంచ్ సుబ్బరామిరెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామాన్ని ట్రస్ట్ చైర్మన్ చెవిరెడ్డి జయచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.2.5 కోట్ల వ్యయంతో విద్యుత్ సహాయంతో మృతదేహాలను దహించే ఈ శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మార్గదర్శకంలో వైకుంఠధామం ట్రస్ట్ ఆధ్వర్యంలో తుడా ఆర్థిక సహకారంతో ఈ ఆధునిక విద్యుత్ శ్మశాన దహన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒక మృతదేహం దహనానికి రూ.5 వేలు మాత్రమే నిర్ణయించామన్నారు. అనాథ శవాలకు ఉచితంగా ఖననం చేస్తామని చెప్పారు. అనంతరం ట్రయల్‌గా మొదటిసారి దిష్టిబొమ్మను విద్యుత్ సాయంతో దహనం చేశారు.

రూ.10,116 విరాళం

అనాథశవాలకు, పేదలకు ఆర్థిక భారం పడకుండా అంతిమ సంస్కారాలు చేసేందుకు వైకుంఠధామం ట్రస్ట్‌కు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి రూ.10,116ను విరాళంగా అందించారు. ఆమేరకు సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ జయచంద్రారెడ్డికి అందజేశారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గోవిందరెడ్డి, భూపాల్, యచ్చం.సుబ్రమణ్యంయాదవ్, కొమ్మినేని మోహన్‌బాబు, కోశాధికారి

విజయ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ చైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రెడ్డి రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను శుక్రవారం ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ విజయ డయాగ్నొస్టిక్ సెంటర్లు దేశవ్యాప్తంగా ఉన్నాయని తెలిపారు. 125వ సెంటర్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఇక్కడ బోర్ 3టీ ఎంఆర్‌ఐ, మల్టీ డైమెన్షనల్ సిటీ, గామా కెమెరా, పూర్తి ఆటోమేటెడ్ ల్యాబ్, డిజిటల్ మామోగ్రఫీ వంటి అత్యాధునిక పరికాలు ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక రక్త పరీక్ష నుంచి పూర్తి స్థాయి రోగ నిర్ధారణ పరిశోధనలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తామని పేర్కొన్నారు. సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈనెల 28వ తేదీ వరకు ఉచితంగా షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేస్తామన్నారు.

రియల్టర్ రూ.32 లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్ : యాదమరి మండలం, కొత్తూరుకు చెందిన పి.వేలాయుధం తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.32 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆయన తరపు న్యాయవాది ఐ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.. వేలాయుధం గత పదేళ్లుగా తిరుపతి, చిత్తూరు, తమిళనాడులోని ఏలూరు తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. 2019లో కోవిడ్ కారణంగా వ్యాపారంలో నష్టం వచ్చింది. కొంతమందికి డబ్బు తీసుకోకుండానే ప్లాట్‌ల వ్యాపారం నిర్వహించి పత్రాలను రాసి ఇచ్చాడు. వ్యాపారంలో నష్టం రావడంతో కొంతమంది వద్ద సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. అయితే నష్టాలు తీవ్రం కావడంతో అప్పుగా తీసుకున్న రుణదాతలకు సొమ్ము చెల్లించలేక వడ్డీలు ఎక్కువయ్యాయి. రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేసినట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. 22 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నాడు.